
# రాజేశ్వరి

## సనగరం పార్థసారథి




గదంతా పరిమళాలతో నిండిపోయింది.

రాజేశ్వరి కిల కిలా నవ్వింది.

సుబ్బయ్యనాయుడి దేహంలోని ప్రత్యణువు పులకించింది. మనస్సు తీయని అనుభూతితో కంపించిపోయింది. ఇటువంటి చోట్ల ఎంతో అనుభవం గడించాడు. కనుక ఇంతవరకు నిగ్రహించుకున్నాడు.

ఆమె అతని చేతిని మృదువుగా పట్టుకొని పట్టెమంచము వద్దకు తీసికెళ్లింది. మంచము మీద కూర్చొని నాయుడు, తన చేతిని పట్టుకొన్న ఆమె చేతిని రెండవ చేతితో స్పృశిస్తూ 'రాజీ!' అన్నాడు.

అతని మాటలు మత్తుగా వున్నాయి.

'నాయుడు బావా!' గోముగా చేయి విడిపించుకొంటూ నవ్వింది.

నాయుడు మత్తుతేరి చుట్టూ పరికించి చూశాడు.

నాలుగు గోడలకు రతిమన్మథుల శృంగార లీలా విలాసాల నిరూపించు చిత్తరువులే కనిపించాయి.

అర్ధనగ్నయై యున్న రతిదేవి చిత్తరువు మీదనుండి దృష్టిని రాజేశ్వరి మీదకు మరల్చాడు నాయుడు.

ఈసారి ఆమె కన్నులు నవ్వాయి. గులాబి బుగ్గలు పల్లవించాయి. చిరుగడ్డం వెక్కిరించింది.

నాయుడిలో తీవ్రమైన తపన బయలుదేరింది. గబాలున ఆమె రెండు చేతులు పట్టుకొన్నాడు.

'రాజీ! రాజీ! నువ్వే నా ప్రాణం' అని నాయుడు యింకేమి పలుకలేక ఆమెను పొదివి పట్టుకొన్నాడు.

అతన్ని విడిపించుకొంటూ 'తలుపు' అని తలుపు వైపు చూపింది రాజేశ్వరి.

అతను వెళ్లి తెరవెనుకగావున్న తలుపును మూసివచ్చి ఆమెను ఆనుకొనే ప్రక్కన కూర్చొన్నాడు.

సిల్కు లాల్చీగుండా అతను ధరించిన పులిగోరు కనిపిస్తోంది.

రాజేశ్వరి అతని వైపు కొంటెగా చూసి లాల్చీ గుండీని విప్పింది. పులిగోరు పతకాన్ని కొన వ్రేళ్లతో తీసుకొని ముద్దు పెట్టింది.

నాయుడు ఆమెను హృదయానికి హత్తుకొన్నాడు.

అంతలోనే తలుపు చప్పుడయింది.

'రాజక్కా! రాజక్కా!' అని పిలుస్తున్నారెవరో.

రాజేశ్వరి మంచంమీదనుండి లేచివచ్చి తలుపు తీసింది.

ఎదురుగా శేషయ్య. గది బయటకు వచ్చింది రాజేశ్వరి.

'ఏం శేషయ్యా, పిలిచావు?' నెమ్మదిగా అడిగింది.

'ప్రసాద్ వచ్చాడు. నీతో మాట్లాడాలట. క్రిందనుంచొని వున్నాడు. పైకి పిలవనా?'

'పైకి రమ్మను చెప్పు.'

శేషయ్య వెళ్లి ప్రసాదును పిలుచుకొని వచ్చాడు.

'ఏం బాబూ! ఏం కావాలి?' ఆప్యాయత ఆమె కంఠంలో ధ్వనించింది.

'రాజక్కా! రేపు కాలేజీఫీజు కట్టడానికి ఆఖరురోజు. పరీక్షఫీజు కూడ కట్టాలి నీకు చెప్పాలని వచ్చాను.'

'సరేలే. ఎంతకావాలంటావు?'

'నూటఏభై అయితే సరిపోతుంది రాజక్కా.'

'శేషయ్యా! బాబుకు డబ్బిచ్చినంపు.' తాళంచెవులు శేషయ్య చేతికిచ్చింది.

'నాయనా! ప్రసాద్! బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలి బాబూ!' అనురాగంతో అంది రాజేశ్వరి.

'అంతా నీచలవే రాజక్కా!' కృతజ్ఞతతో బరువెక్కి పోయింది అతని కంఠం.

'వెళ్ళు బాబూ! వెళ్ళు.'

ప్రసాద్ వెళ్ళిపోయాడు.

రాజేశ్వరి తిరిగి గదిలో ప్రవేశించి తలుపు మూసింది.

నాయుడు పరుపుమీద పడుకొని ఏదో ఆలోచిస్తున్నాడు.

'క్షమించండి, కొద్దిసేపు ఆలస్య మయింది.' క్షమాపణ చెప్పుకొన్నది రాజేశ్వరి.

'రాజీ! యిలా వచ్చికూర్చో,' అని తన ప్రక్కలో చోటిచ్చాడు నాయుడు.

రాజేశ్వరి కూర్చొని, పులిగోరు పతకాన్ని చూపుడువ్రేలితో మృదువుగా కొట్ట సాగింది.

'రాజీ! నాకు కొన్ని సందేహాలున్నాయి తీరుస్తావా?'

తీరుస్తానన్నట్టు ఆమె చిరునవ్వు నవ్వింది.

'రాజీ! నీకు తోబుట్టువు లెవరులేరని క్రితంసారి వచ్చినపుడు చెప్పినట్టు గుర్తు. కాని నిన్ను ఆ అబ్బాయి 'అక్కా' అని...' మధ్యలోనే మాటనాపి ఆమె ముఖంవైపు చూశాడు,

'నిజమే! నాకు 'నా' అన్నవారెవరు లేని అనాథనే ఒకప్పుడు. తల్లితండ్రి తోబుట్టువులు ఎవరూలేరు. కానీ, ఈనాడు అనాథులంతా నావారే—నావాళ్ళు, తోడునీడలే.' నిశ్చలంగా జవాబిచ్చిన ఆమెకంఠంలో వ్యధ లేక పోలేదు.

ఆమె మాటలు నాయుడికేమి అర్థం కాలేదు. ఆ మధురసమయం వృథాచేయ దలచుకోలేదు.

* * *

'రాజేశ్వరమ్మా!'

'నమస్కారము. లోపలకు దయచేయండి శాస్త్రులవారూ!' వినయంగా ఆహ్వానించింది బసవయ్యశాస్త్రిని.

'ఆయుష్మాన్భవ!' అంటూ దగ్గరున్న కుర్చీలో కూర్చొన్నాడు.

'అంతకన్న మరేమి ఆశీర్వదించలేక పోయారా? స్వామీ!'

'వృత్తి ఏదయినా, దానవ్రతం చేపట్టిన దానవమ్మా! దానవ్రతులు ఆయుష్మంతులే కావాలి.'

'ఎందుకు తమరావిధంగా సెలవిచ్చారు. స్వామీ?'

రాజేశ్వరమ్మా! అట్టివారివలన సంఘానికి ఎన్నో వుపకారాలు జరుగగలవు.'

'అయితే...సంఘంలో నాకంతటి స్థానముందంటారా?' వుత్సాహంగా అడిగింది రాజేశ్వరి.

'తప్పకుండావుంది. అది వుండబట్టే నేనివాళ యీ విధంగా రావలసి వచ్చింది.'

బసవయ్యశాస్త్రికి తన వుపోద్ఘాతానికి ఆదను దొరికినట్టయింది.

'ప్రతిగ్రామానికి దేవాలయం హృదయం వంటిది. దేవుడు మనకు కనిపించకపోయినా, మనకీజన్మ నిచ్చినందుకు మనం కృతజ్ఞత తెలుపుకోవలసివుంది. మన గ్రామానికి సరియైన దేవాలయమేలేదు. వున్న వేణుగోపాలస్వామి ఆలయము జీర్ణమైపోతోంది. దాన్నే పునరుద్ధరణచేస్తే మన గ్రామానికి ఆలయం దక్కుతుందని ఆ భారాన్నంతా నామీద వేశారు. నీ సలహా ఏమిటమ్మా!'

రాజేశ్వరి చిరునవ్వు నవ్వి, 'మీరు పెద్దలు, అనుభవజ్ఞులు నేనేమి సలహా యివ్వగలను.' అంది.

'అందుకు ఏభయివేలదాకా ఖర్చవుతుందని అంచనా వేశారు. గ్రామంలోని దాతలు తలా యింత వేస్తున్నారు దైవ కార్యానికి. మరి నీ వంతు కూడ పదివేలు వేశాము.'

'శాస్త్రులవారూ! మీకు తెలియనిదేముంది. దైవకార్యానికి యివ్వడానికి నేను వెనుకాడడములేదు. కాని నా కంత శక్తి ఎక్కడుంది.'

'నీవే యీలాగంటే ఏలాగమ్మా! నీశక్తి, నీ పలుకుబడి నాకు తెలియనిది కాదు. నీవు చేస్తున్న ధర్మ కార్యాలు దాగేవి కావు. ఇప్పుడిది దైవ కార్యము. కాదనకు రాజేశ్వరమ్మా! వేళయింది. యిక వస్తాను.'

రాజేశ్వరికి మాట్లాడేందుకు వీల్లేకుండా వెళ్ళిపోయాడు బసవయ్య శాస్త్రి.

* * *

రంగనాయకి ఆ వూరు వచ్చినపుడు మట్టిగాజుల చేతులతోనే వచ్చింది. ఆమె దారిద్ర్యం ఆమె అందాన్ని ఏ మాత్రం దాయలేకపోయింది. ఆ వూరిలోని రసికుల నెందర్నో ఆకర్షించింది.

అంతే! సంవత్సరం తిరగకుండానే రంగనాయకి మట్టిగాజుల స్థానే మోచేతి వరకు బంగారు గాజులు ధరించగలిగింది. ఆమె అంతస్తు హస్తిమశకాంతరంగా పెరిగి పోయింది.

శరభయ్య నాయుడికి మున్సిపల్ చెయిర్మెన్ అయిన రోజుల్లోనే భార్యావియోగం కలిగింది.

ఆ వియోగంలో బాధపడుతుండగానే ఒక కౌన్సిలర్ ఆపద్బాంధవుడై ఆదుకున్నాడు. అతని మూలంగానే రంగనాయకితో శరభయ్య నాయుడికి సఖ్యం కుదిరింది.

ఆ నాటినుండి రంగనాయకికి పలుకుబడితోపాటు, ఆస్తికూడ పెరిగిపోయింది.

ఆమె కులం, గోత్రం ఎవరికీ అవసరం కాలేదు. ఆమె మాత్రమే కావాలనుకునే వారు ఎవరికి వారు.

రంగనాయకి వృత్తి ఏదయినా కానీ, దేవుడంటే అమితమైన నమ్మకం, అంతులేని భక్తి.

ప్రతినిత్యం సంధ్యాసమయంలో వేణుగోపాలుని గుడికి వెళ్తుంది. భగవంతుడికి మనసారా నమస్కరిస్తుంది.

పూజారి బసవయ్యశాస్త్రి చేతిలో ప్రసాదం పెడుతూ 'నాయకీ' అంటాడు.

రంగనాయకి కొంటెగా నవ్వుతుంది.

ఆమెకు ఆ గ్రామంలో అందరితోను పరిచయముంది. అలాగే బసవయ్యశాస్త్రి తోను.

ఒకనాడు తెల్లవారకముందే రంగనాయకి యింటికి వచ్చాడు బసవయ్యశాస్త్రి— అతని చేతిలో పసికందు.

'ఈ బిడ్డను మీరే కాపాడుకోవాలి.'

'ఎవరి బిడ్డ స్వామీ!'

'ఏమో నాకు మాత్రమేమితెలుసు. ఆ వేణుగోపాలునికే తెలియాలి. ఆలయంలో ఏడుపు వినిపించింది. దగ్గర ఎవరూలేరు. నేను దేవాలయం ప్రాంతమంతా చూశాను.

ఎవరూ కనిపించలేదు. కావాలనే ఎవరో వదలి పోయారని నిశ్చయించుకొని బిడ్డను యిక్కడకు తీసుకొనివచ్చాను. దీని సంరక్షణ నీకే అప్పగిస్తున్నా.'

తప్పదన్నట్టుగ రంగనాయకి ఆ బిడ్డ సంరక్షణ కొప్పుకొన్నది.

బసవయ్యశాస్త్రి రహస్యంగా ఆ బిడ్డకు 'రాజేశ్వరి' అని నామకరణం చేశాడు.

రాజేశ్వరికి రంగనాయకే తల్లి అయింది.

*  *  *

'శేషయ్యా!'

'రాజక్కా!'

'నాపాడ అనుకోకుండానే పెద్ద బరువు పడింది.' దిగులుపడుతూ అంది రాజేశ్వరి శేషయ్యతో.

'ఏమిటది రాజక్కా! అంతగా దిగులుపడి పోయావు ?'

'దేవాలయ పునరుద్ధరణకు నేను పది వేలు యివ్వాలని శాస్త్రిగారన్నారు.'

'నువ్వు వొప్పుకున్నావా ?'

'తప్పలేదు. దేవుడే రక్షించాలి.— ఆఁ. పరంధామరెడ్డిగారు అయిదువందలు పంపుతా మన్నారు. ఒకసారి వెళ్లిరా.'

'సరే. రాజక్కా! మధ్యాహ్నం నీకోసం అనాథశరణాలయంవారు వచ్చారు. వారికి ననమీనెల డబ్బు పంపలేదు.'

'ఆలాగా...అయితే రెడ్డిగారిదగ్గర డబ్బు తీసుకొని 'శరణాలయం' వారికి యిచ్చిరా!'



శేషయ్య వెళ్లిపోయాడు.

కొంతసేపటికి కొందరు పల్లెవారు ఆడ, మగ వచ్చారు. వారి ముఖాలంతా దుఃఖంతో పీక్కుపోయి వున్నాయి.

'ఎవరయ్యా మీరంతా?' ప్రశాంతంగా అడిగింది రాజేశ్వరి.

పల్లెవాండ్లలో పెద్దవాడయిన నరసయ్య ముందుకొచ్చాడు.


'మాది యీ ప్రక్కపల్లే తల్లి! వరా దురదృష్టం పల్లెపల్లంతా కాలిపోయింది. తిండీతిప్పలులేక మలమల మాడిపోతున్నాం తల్లి! మాకింత సాయంచేయమ్మా!'

రాజేశ్వరికి అందాన్ని మించిన మన స్సుంది. అది వెన్నకంటే మృదువైనది. ఎదుటివారివేడి నిట్టూర్పునుకూడ భరించ లేనంతటి కోమలమైనది.

రాజేశ్వరికి పల్లెజనం బాధను చూచి కన్నీళ్లుతిరిగాయి.

లోపలికివెళ్లి మున్నూయిరూపాయిలు తీసు కొని నరసయ్యకిచ్చి, 'యివి తీసుకొని యీపూట గడుపుకోండి. మున్సిపల్ చెయిర్ మేన్ సుబ్బయ్యనాయుడి వద్దకువెళ్లి నేను పంపించినానని చెప్పండి. వారు మీకు సహాయం చేస్తారు.' అంది.

పల్లెజనం తమ కృతజ్ఞత వెలిబుచ్చి వెళ్లిపోయారు.




'రామమ్మా! రామమ్మా!' అని వంట మనిషిని పిలిచింది.

'పిలిచావా రాజమ్మా?' చేతులు తుడుచు కొంటూ వచ్చింది రామమ్మ.

'నాకు వొంట్లో బాగాలేదు. డాక్టరమ్మను పిలుచుకొని వస్తావా ?' అంది రాజేశ్వరి.

డాక్టరమ్మను పిలుచుకొని రావడానికి వెళ్లింది రామమ్మ.

*  *  *

'రాజక్కా! రాజక్కా!' శేషయ్య పిలిచాడు.

రాజేశ్వరి గదిలోనుండి బయటకు వచ్చింది.

'శ్రీరాములు శాస్త్రిగారు వస్తామన్నారు.' అన్నాడు శేషయ్య.

'సరే' సాధారణంగానే అని, 'ప్రసాద్‌కు పరీక్షలయిపోయాయంటనా ?' ప్రసాద్ చదువుని గురించి అడిగింది.

'అయిపోయాయి. బాగానే వ్రాశా నన్నాడు.'

'దేవాలయం పని జరుగుతోందా?'

'పని పూర్తి కావస్తున్నది. ఏభయి మంది కూలీలు పని చేస్తున్నారు. శాస్త్రి గారిదే అజమాయిషీ అంతా.'

'సాయంకాలం దేవాలయం చూచి రావా లనుకొంటున్నాను. శేషయ్యా!'

'రామమ్మను కూడ వెంట తీసుకెళ్ళు. రాజక్కా!'

అంతలోనే రామమ్మ కాఫీ కప్పులతో ప్రవేశించింది.

'రామమ్మా! మనం సాయంకాలం దేవా లయం వెళ్లాలి. సిద్ధంగా వుండు.'

రాజేశ్వరి, శేషయ్య కాఫీ త్రాగేశారు.

'సరేనమ్మా!' అని కాఫీ కప్పులతో లోపలికి పోయింది రామమ్మ.

'శేషయ్యా! యింకా ఎంత డబ్బుంది బ్యాంకులో.' అడిగింది రాజేశ్వరి.

'రెండు వేలకు తక్కువగానే వుంది రాజక్కా!'

'అంతేనా! దేవాలయానికే నాలుగువే లింకా యివ్వాలి.' దిగులు పడిపోయింది రాజేశ్వరి.

'ఉన్నదంతా దాన ధర్మాలకే యిచ్చేస్తుంటే కొండలయినా కరగిపోతాయి.'

'కాని ఏం చేసేది శేషయ్యా! సంఘంలో నేను ఒక జీవిని. నేను సంఘానికి అక్కర

లేకపోయినా, సంఘం కావాలి. శక్తి వున్నప్పుడే ఒక పని చేయగలము. ఆపనే నలుగురి వుపయోగానికి చెందేలా చేయడములోనే జీవితం సార్థకమవుతుందని మా అమ్మ చెబుతుండేది. నా ఆశయము అదే. నా కంతకన్న మహాభాగ్యం లేదు.'

'తన్నుమాలిన ధర్మం అంత మంచిది కాదు.' శేషయ్య, రాజేశ్వరికి అన్యాయం జరుగుతోందన్న బాధతోనే అన్నాడు.

'నిజమే. కానీ అది అందరిపట్ల సత్యం కాదు. శేషయ్యా! సంఘపు కట్టుబాట్లు వేయివిధాలుగా వుండవచ్చు. కాని స్త్రీ అందరికీ ఒక్కటే ఆశ, ఆశయముంటుంది. తన కొక తోడు వుండాలి. ఆ నీడలో తాను చల్లగా వుండాలి. తన సుఖానికి కారకులైన వారి సంతోషానికి తాను త్యాగంచేయాలి. తనకు కలిగే సంతానం కోసం దాచిపెట్టాలి. ఇంకా ఎన్నెన్నో ఆశలుంటాయి. ఇవన్నీ స్త్రీకి ప్రకృతి ప్రసాదించినవనాలి. నాకూ అటువంటి ఆశలున్నాయి. నాకు తల్లెవరో, తండ్రెవరో తెలీదు. రంగానాయకమ్మే తల్లిగా నన్ను పెంచి, మధ్యలోనే తన ధర్మాన్ని నిర్వర్తించుకొని వెళ్ళిపోయింది. ఆమె తరువాత నా కెవరు లేరనీదనే సంఘమే. దాని నీడలోనే కాలం గడుపుతున్నాను. నాన్న నమ్ముకుని వున్నదానను. దాని పురోభివృద్ధి నాకు అవసరమే. కాదంటావా? నా తరువాత అనుభవించటానికి భర్తా? బిడ్డలా

# రాజేశ్వరి

ఎవరున్నారు? శేషయ్యా!' రాజేశ్వరి ఏడవసాగింది.

'రాజక్కా! నీకావేశం కలిగించాను క్షమించు.' తన బాధను వ్యక్తపరిచాడు శేషయ్య.

'మరేం ఫరవాలేదు. మనస్సు తేలిక పరచుకొన్నాను.'

*　　*　　*

'నీతో ఒక్కవిషయం చెప్పాలి. వీరిని అవతలకు పంపించు.' డాక్టరమ్మ రాజేశ్వరిని పరీక్షించిన తరువాత అంది.

రాజేశ్వరి అక్కడవున్న రామమ్మ, శేషయ్యవైపు చూచింది. వారిద్దరు గది అవతలకు వెళ్ళిపోయారు.

డాక్టరమ్మ రాజేశ్వరితో అంది, 'నీ రక్తం చెడిపోయింది. కొంతకాలం విశ్రాంతి అవసరం.'

ఆ మాటలు వినగానే రాజేశ్వరి ముఖము వాడిపోయింది.

'ఈ మందులు తీసుకొంటూవుండు.'అని చిట్రా వ్రాసి యిచ్చివెళ్ళిపోయింది డాక్టరమ్మ.

డాక్టరమ్మ వెళ్ళిన తరువాత రామమ్మ, శేషయ్య ఆత్రుతగా గదిలోనికి వచ్చారు.

'రాజక్కా! డాక్టరమ్మ ఏమంది.' శేషయ్య అడిగాడు.

'భయపడవలసినదేమీలేదు. విశ్రాంతి అవసరం. అందుకు వాతావరణం మార్పుకూడ వుంటే మంచిదని చెప్పింది.' మాటలు ధైర్యంగానే అంటున్నా, ఆమెలోనున్న విషాదం ఆమెకే తెలుసు.

ఆ మాటలకు శేషయ్య రామమ్మకుదుటపడ్డారు.

'రామమ్మా! అలసటగావుంది. కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను.' అని తన గదిలోని కెళ్ళిపోయింది.

*　　*　　*

'రాజేశ్వరమ్మా! నువ్వు పిలిచావని శేషయ్య వచ్చి ప్రొద్దున్నే చెప్పాడు.' ఇల్లు ప్రవేశిస్తూ అన్నాడు బసవయ్యశాస్త్రి.

'అవును. శాస్త్రులవారూ! రండి. కూర్చోండి.' ఎదుటనున్న కుర్చీ చూపించింది. కూర్చొని, 'విషయమేమిటో చెప్పమ్మా!' అడిగాడు బసవయ్యశాస్త్రి.

'నేను యీవూరు వదలి పోవాలనుకుంటున్నాను. దేవాలయ పునరుద్ధరణకు నేనింకా బాకీ వున్నాను. నన్ను నమ్మిన రామమ్మ, శేషయ్యలకు కూడ వుపాధి కలిగించవలసిన బాధ్యత కూడ నాకుంది. అందుకని ఒకటి నిర్ణయించుకొన్నాను.' నిశ్చలంగా అయిన ముఖంలోనికి చూచింది.

'ఏమిటమ్మా! అది.'

'శాస్త్రులవారు! యీ యింటిని ఎవరికైనా అమ్మివేయాలని నిశ్చయించుకొన్నాను. మీరే ఎవరినైనా మాట్లాడండి.' ప్రార్థనాపూర్వకముగా అంది.

'ఊరు విడచి వెళ్ళవలసిన అగత్యమేమొచ్చిందమ్మా?' ఆశ్చర్యపోయాడు శాస్త్రి.

'క్షమించండి శాస్త్రులవారు! మిమ్మల్ని మెప్పించగల జవాబు చెప్పలేను. కానీ ఈ వుపకారం చేయండి. ఆజన్మాంతం కృతజ్ఞురాలినిగా వుంటాను. విధిలేక 'సరే'యన్నట్లు తలపంకించాడు శాస్త్రి.

'మరల యీ వూరికి రావామ్మా!'

'తెప్పకుండా వస్తాను. ఎప్పుడో చెప్పలేను.' రాజేశ్వరి కన్నులు చెమర్చాయి. బసవయ్యశాస్త్రి వెళ్ళిపోయాడు.

శేషయ్యను పిలిచింది రాజేశ్వరి.

'రాజక్కా! పిలిచావా?' అంటూవచ్చాడు శేషయ్య.

'అవును. శేషయ్యా! రామమ్మను కూడ ఒక్కమాటుపిలు.'

రామమ్మను పిలుచుకొని వచ్చాడు శేషయ్య.

'నేను త్వరలో యీ వూరు విడిచిపోవా



లను కుంటున్నారు. కారణాలు అడక్కండి.'

'ఏమిటిది రాజక్కా!' పిడుగు పడ్డట్టుగా అదిరిపడ్డాడు శేషయ్య.

'సాధారణ విషయమే. మీకిద్దరికీ ఒక బ్రతుకు తెరువు కలిగించి వెళ్ళాలనే నా కోరిక. మీకిద్దరికీ చెరో వెయ్యిరూపాయిలిస్తాను. మీ జీవన మార్గాలు మీరు చూసుకోండి. నేనింతకంటే మరేమి చెప్పలేను. వెళ్ళండి.' అని ఆయాసంగా సోఫాలో పడుకొంది.

రామప్ప, శేషయ్యలకు రాజేశ్వరి వైఖరేమి అర్థం కాలేదు.

*　　　　*　　　　*

సూర్య, చంద్రులు దోబూచులాడుకొంటూనే అయిదేళ్ళు పెద్దవాళ్ళయిపోయారు.

శేషయ్య పదివేలరూపాయల ఆస్తిపరుడయ్యాడు. వేణుగోపాలస్వామి దేవాలయము ఎదురుగుతున్న ఫాన్సీషాపుకు యజమాని అయ్యాడు.

బసవయ్యశాస్త్రి తన అర్చకత్వాన్ని కుమారుడు శ్రీకంఠశాస్త్రికి వొప్పగించి తను విశ్రాంతి తీసుకొంటున్నాడు.

ఏమి తోచనప్పుడు శాస్త్రి, శేషయ్య కలిసి రాజేశ్వరిని గురించే మాట్లాడుకొంటుంటారు.

ఒకరోజు రాత్రి ప్రొద్దుపోయింది. దేవాలయానికి భక్తులంతావచ్చి వెళ్ళిపోయారు.

బసవయ్యశాస్త్రి వద్దకు శ్రీకంఠశాస్త్రి పరుగు పరుగున వచ్చాడు.

'దేవాలయంలో ఒకావిడ మూలుగుతూ పడివుంది. ఎంతపిలిచినా పలకడంలేదు చూద్దువుగాని రా నాన్నా!' అని తండ్రిని పిలిచాడు.

బసవయ్యశాస్త్రి కుమారునితో వెళ్ళి చూశాడామెను.

పోషణలేక శుష్కించిన శరీరం. తైల సంస్కారహీనమైన జుత్తు. లోపలకు పీక్కుపోయిన కళ్ళు ... అయినా ఆ 'ముక్కు!' శాస్త్రి ఆలోచనలను అయిదేళ్ళ వెనక్కు నెట్టింది ఆ ముక్కు! అతడు కలవరపడిపోయాడు. ఆమె తనకు తెలుసునని ఏవిధంగా చెప్పగలడు తనకొడుకుతో.

'వేణుగోపాలా! ఎంత పరీక్ష పెట్టావు తండ్రీ!' మనస్సులోనే బాధపడ్డాడు.

'ఇప్పుడేమి చేయాలి నాన్నా!' కొడుకు అడుగుతున్నాడు.

'తెల్లవారేవరకు యిక్కడేవుండనీ. తరువాత ఆలోచిద్దాం.' అనలేక అనగలిగాడు బసవయ్యశాస్త్రి.

'ఈ పాపానికి తాను కారణం కాదుగదా'ని తనని తాను తిట్టుకొన్నాడు. అతని మనస్సు వికలమైపోయింది.

'వేణుగోపాలా! నన్నుకూడా శిక్షించు.' మనస్సులోనే వేడుకొన్నాడు.

దేవాలయపు తలుపులన్నీ మూసి తమ వాటాలోకిపోయి పడుకొన్నారు తండ్రీ కొడుకులు.

తెల్లవారుజామున దేవాలయంలో గలభాగా వుంది. బసవయ్యశాస్త్రికి మెలకువచ్చింది. శ్రీకంఠశాస్త్రి ఎప్పుడో లేచివెళ్ళాడు.

రాజేశ్వరి మనస్సులో మెదలుతుండగ పరధ్యానంగా పడుకొన్నాడు శాస్త్రి.

'ఎవరో ఆడమనిషి చనిపోయింద'ని కేకలు పెడుతున్నారు. శాస్త్రి గుండెలు పిసికి నట్లయింది.

'తనువెళ్ళి రాజేశ్వరిని కడసారిగా చూడా'లని వుంది.

'రాజేశ్వరమ్మా! వింద్యైన స్థితిలో చూచిన నిన్ను నికృష్టస్థితిలో చూడలేకున్నానమ్మా! నీవలనే గదా వేణుగోపాలునికి పునర్జన్మ కలిగింది. అకారణంగానే నీజన్మ వెళ్ళిపోయింది. ఇక్కడే పుట్టావు. ఇక్కడే కన్నుమూశావు. ధన్యురాలవమ్మా!! అతని హృదయం పరిపరి విధాల పరితపిస్తోంది.

'వృత్తికి వేశ్యవయినా వున్నతమైన వ్యక్తిత్వం కలదానవమ్మా! లోకులు ఎంతగా నిన్ను గూర్చి అసహ్యించుకొన్నా వారికి ఉపకారం చేశావు. నువ్వు కళ్ళెదుట లేనప్పుడు నీ మంచితనం అర్థమయిందమ్మా. నీవల్లనే వుపకారంపొంది నీకు మేమేమి చేయగలిగాం. అపకారం తప్ప. అదే సంఘంలక్షణమేమో?' కన్నీరు ఏకధారగా ప్రవహిస్తోంది. అంతలోనే, 'మున్సిపాలిటీబండి లోనికి చేర్చమ'ని అంటున్నట్టుగ వినిపించింది.

'నేనుండికూడ నిన్ను మున్సిపాలిటీ బండికే అప్పగించవలసివచ్చింది. నేను స్వార్థపరుణ్ని తల్లీ! క్షమించు.' కుమిలిపోతున్నాడు శాస్త్రి. కడసారిగానైన రాజేశ్వరిని చూడాలని మనస్సు ఘోషపెడుతోంది. బసవయ్యశాస్త్రి లేచివెళ్ళాడు మనోవ్యథ భరించలేక. అతడక్కడికి చేరేసరికి మున్సిపాలిటీబండి బయలుదేరుతోంది. శాస్త్రి మెట్లమీదనే నిలబడిపోయాడు వెళ్తున్న బండివంక చూస్తూ.

'శాస్త్రులవారూ! ఒకసారి యిటురండి' శేషయ్యవచ్చి అవతలకు పిలిచాడు. శాస్త్రి వెళ్ళాడు. 'ఆమె రాజక్కలావుంది. రాజక్క కాదుగదా!' అనుమానంగా అడిగాడు శేషయ్య.

'రాజక్కే — శేషయ్యా!' శాస్త్రికి దుఃఖంతో కంఠం మూసుకుపోయింది. శేషయ్యకు ఏడుపొచ్చింది. అక్కడవుండలేక బండివెళ్ళిన వైపు పరుగుతీశాడు.

'నేనూ వస్తున్నా, శేషయ్యా!' కన్నీళ్ళు తుడుచుకుంటూ శాస్త్రికూడ వెనుకనే వెళ్ళాడు.

మున్సిపాలిటీబండి శ్మశానంవైపు సాగింది. ●

